క్లుప్తంగా

పరారైన ఖైదీకి రెండేళ్ల జైలు

గన్నవరం: సబ్‌జైలుకు తరలిస్తుండగా ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌ను నెట్టివేసి పరారైన నిందితుడికి గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు బుధవారం రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. వివరాలిలా ఉన్నాయి. ఘంటసాల మండలం శ్రీకాకుళంకు చెందిన గరికె సుబ్బరాజు అలియాస్ బ్లేడ్ స్థానిక సబ్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 25న మరో కేసు విచారణలో భాగంగా పీటీ వారెంట్‌పై సుబ్బరాజును ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రాజు భీమవరం కోర్టుకు తీసుకువెళ్లారు. తిరిగి రాత్రి గన్నవరం తీసుకువచ్చి సబ్‌జైలులోకి పంపించే క్రమంలో అతనిని నెట్టివేసి సుబ్బరాజు పరారయ్యాడు. ఈ ఘటనపై హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన గన్నవరం పోలీసులు సుబ్బరాజును అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు సుబ్బరాజుకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ 12వ ఏఎంఎం కోర్టు మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపారు.

4 లోగా రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు

పెడన: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం గుంటూరు వారు నిర్వహించిన పదో తరగతి, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఈ నెల 25న విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీ ఓపెన్ స్కూలు. ఏపీ. జీవోవీ. ఇన్‌లో చూసుకోవాలని ఆమె పేర్కొన్నారు. కృష్ణాజిల్లాకు సంబంధించి పదో తరగతిలో 515 మంది పరీక్ష రాయగా 351 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇంటర్మీడియెట్‌లో 986 మందికి 774 మంది పాస్ అయ్యారని పేర్కొన్నారు. ఫలితాల్లో ఏమైనా సందేహాలుంటే పది, ఇంటర్ వారు రీ వెరిఫికేషన్ కోసం ఒక్కో సబ్జెక్టుకు రూ.200 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీ కౌంటింగ్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 చెల్లించి ఈ నెల 27 నుంచి ఆగస్టు నాలుగో తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్ ప్రవేశాల కోసం ఈ నెల 27 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు అవకాశం కల్పించారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓపెన్ స్కూల్స్ హెల్ప్‌లైన్ నంబరు 80084 03506లో సంప్రదించాల్సిందిగా డీఈవో సూచించారు.

కొనసాగుతున్న వరద

జి.కొండూరు: ఎడతెరిపిలేని వర్షాల కారణంగా జి.కొండూరు మండల పరిధిలోని పలు వాగుల్లో వరద ప్రవాహం రెండవ రోజు కొనసాగింది. బుడమేరు నుంచి కవులూరు హెడ్ రెగ్యులేటర్‌కు బుధవారం సాయంత్రం వరకు 4,307 క్యూసెక్కుల వరదనీరు చేరినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా మండలంలో పులివాగు, జమ్మివాగు ప్రవాహం మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కొంతమేర పెరగడంతో వంతెనల వద్ద వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. తెల్లదేవరపాడు, గంగినేని గ్రామాల నడుమ ఉన్న చప్టా వద్ద జమ్మివాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు రాకపోకలను నిలిపివేశారు. ఈ వాగు దగ్గర వరదప్రవాహాన్ని ఎస్సై ధర్మరాజు పర్యవేక్షించారు. అదేవిధంగా హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల నడుమ బుడమేరు వంతెనపైకి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో రెండోరోజు వాహనాల రాకపోకలను నిలిపివేశారు.


హెచ్.ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల నడుమ బుడమేరు వరద ప్రవాహం

ఉధృతంగా ప్రవహిస్తున్న కుంపెనీ వాగు

ఆగిరిపల్లి(నూజివీడు): మండలంలోని ఆగిరిపల్లి–నూగొండపల్లి గ్రామాల మధ్య ఉన్న కుంపెనీ వాగు బుధవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతంలోని కొండల నుంచి పెద్ద ఎత్తున వరదనీరు వస్తుండటంతో కుంపెనీ వాగు వరదతో పరవళ్లు తొక్కుతోంది. రహదారిపై మూడడుగుల ఎత్తుపైనే వరదనీరు ప్రవహించడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. వాగులో వరదను తహసీల్దార్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

తమ్మిలేరుపై తాత్కాలిక రహదారికి గండి

బలివే(ముసునూరు): ఏలూరు జిల్లాలోని ప్రసిద్ధ బలివే రామలింగేశ్వరస్వామి ఆలయ సమీపంలో అవిభక్త కృష్ణా–పశ్చిమగోదావరి జిల్లాల మధ్య తమ్మిలేరుపై ఉన్న తాత్కాలిక వంతెన తెగిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, పొలాల్లోని నీరు తమ్మిలేరులో కలవడంతో ప్రవాహ ఉధృతి పెరిగింది. దీంతో బుధవారం తమ్మిలేరుపై తాత్కాలిక రహదారికి గండి పడింది. బలివే–విజయరాయిల మధ్య రాకపోకలు స్తంభించాయి. విషయం తెలుసుకున్న సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్, ఎస్సై ఎం.కుటుంబరావు, రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు గండిని పరిశీలించారు.

నరుకుళ్లపాడు చెరువు పరిశీలన

రెడ్డిగూడెం: మండలంలోని నరుకుళ్లపాడు–ఓబులాపురం రహదారిపై పొంగి ప్రవహిస్తున్న చెరువును మైలవరం ఏసీపీ రమేష్, సీఐ మురళీమోహన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. రెడ్డిగూడెం ఎస్సై శ్రీను పాల్గొన్నారు.

ఎడతెరిపిలేకుండా వర్షం.. నిండిన చెరువులు

చాట్రాయి: రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షం కురవడంతో మండలం పరిధిలోని చెరువుల్లోకి వరద నీరు చేరింది. చనుబండ నరసింహారావుపాలెం గ్రామాల మధ్య రేగటి వాగు, చాట్రాయి గొల్లగూడెం మర్లపాలెం, పోలవరం కొత్తగూడెం, యర్రవారిగూడెం గ్రామాల మధ్య ఉప్పు వాగులో వరద నీరు ప్రవహిస్తుండడంతో ద్విచక్రవాహనాల రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. తమ్మిలేరు ఎగువన, మండలంలో కురుస్తున్న వర్షాలకు తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు వరద నీరు చేరింది. బూరుగుగూడెం వద్ద బొల్లికుంటకు వచ్చే వరద వేసిన వరి నాట్లను ముంచేసింది. ఖమ్మం జిల్లా వెంకటాపురం బందెడ వాగు నుంచి మండలంలోని చనుబండ పెద్ద చెరువుకి వరద నీరు చేరడంతో దాదాపు 90 శాతం నిండింది. తమ్మిలేరు రిజర్వాయర్‌కు మధ్యాహ్నం 12 గంటలకు 2 వేల క్యూసెక్కులు వరద నీరు చేరిందని సాయంత్రానికి ఇంకా పెరగవచ్చని ఏఈ పరమానందం తెలిపారు. మండలంలో బుధవారం ఉదయం 8 గంటలకు 80 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు.

పూడుకుపోయిన మట్టి తొలగింపు

జక్కంపూడి(విజయవాడరూరల్): బుడమేరు కాలువలో నీరు ప్రవహించేందుకు బుధవారం ఇరిగేషన్ అధికారులు, రైతులతో కలిసి పొక్లెయిన్‌తో పనులు చేయించారు. రాయనపాడు–జక్కంపూడి గ్రామాల మధ్య దక్షిణమధ్య రైల్వే నిర్మిస్తున్న రైల్వేలైను నిమిత్తం తవ్విన మట్టిని బుడమేరు కాల్వ పై వేయడం వలన కాల్వ పూడుకుపోయి నీరు ప్రవహించడంలేదని ఇరిగేషన్ ఏఈ రాజశేఖర్ తెలిపారు. దీని ప్రభావంతో రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి గ్రామాల్లో బుడమేరు పొంగి ప్రవహించినట్లు పేర్కొన్నారు. బుడమేరు కాల్వ పూడుకుపోయిన ప్రాంతంలో మట్టి తొలగించడంతో నీరు ఎలాంటి ప్రమాదం లేకుండా పారుదల జరుగుతుందని ఏఈ తెలిపారు.

భారీవర్షాలకు రోడ్లు ధ్వంసం

తిరువూరు: మండలంలో కురుస్తున్న భారీవర్షాలతో ఆర్‌అండ్‌బీ రహదారులు ధ్వంసమయ్యాయి. తిరువూరు–మధిర, కోకిలంపాడు, మల్లేల వెళ్ళే రహదారులు గోతులు పడి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలు తగ్గిన వెంటనే మరమ్మత్తులు చేపడతామని తిరువూరు ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు.

ఎస్సీ కాలనీలో వర్షపునీరు తరలింపు

మూలపాడు(ఇబ్రహీంపట్నం): కురుస్తున్న అధిక వర్షాలకు మూలపాడు ఎస్సీ కాలనీలో నిలిచిన నీటిని తరలించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. సర్పంచ్ చింతల భూలక్ష్మి జేసీబీతో కందకాలు తవ్వించి నూతన సిమెంటు పైపులు ఏర్పాటు చేసి వర్షం నీటి తరలింపునకు మార్గం సుగమం చేశారు. ఈ పనులను జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి పర్యవేక్షించారు.

చంద్రాలలో..

చంద్రాల(మైలవరం): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చంద్రాల గ్రామం బీసీ కాలనీ, యాదవుల బజారు, మెయిన్ బజారులో నిలిచిన వర్షం నీటిని తరలింపునకు చర్యలు చేపట్టారు. సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు ఆధ్వర్యంలో బుధవారం జేసీబీతో రోడ్లుకు ఇరువైపుల కచ్చా డ్రెయిన్లు తీశారు.


మూలపాడులో వర్షపునీటి తరలింపు పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ భూలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి

ఆగస్ట్ 10 తర్వాత సమ్మెలోకి విద్యుత్ ఉద్యోగులు

ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపు


సంఘీభావం తెలుపుతున్న స్ట్రగుల్ కమిటీ సభ్యులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కమ్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్ట్ 10 తర్వాత సమ్మెలోకి వెళ్లేందుకు సమాయత్తం కావాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ పిలుపునిచ్చింది. ఆగస్టు 17న విజయవాడలోని విద్యుత్ సౌధ ముట్టడికి భారీగా తరలి రావాలని కోరింది. నగరంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విద్యుత్ రంగ ఉద్యోగుల సమస్యలపై ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అండ్ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ సందచౌదరి మాట్లాడుతూ విద్యుత్‌ను మార్కెట్ సరుకుగా మార్చే ప్రయత్నాలపై ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆయన విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.హెచ్. నర్సింగరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ విద్యుత్ రంగంలోని ఉద్యోగుల సమస్యలపై యాజమాన్యాలు, ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఉద్యోగులకు కొత్త పీఆర్సీలోనైనా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

తీర్మానాలు

ఈ సందర్భంగా సదస్సు పలు తీర్మానాలు చేసి ఆమోదించింది. ఈ నెల 30న ప్రతి జిల్లా కేంద్రాల్లో ఇతర ఉద్యోగ, కార్మిక సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశాలు, 31న డిమాండ్స్ డేగా అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతి పత్రాలను ఇవ్వాలని, ఆగస్ట్ 2న అన్ని సర్కిల్ కార్యాలయాలు, ఉత్పాదక కేంద్రాల వద్ద, 7న తిరుపతి లోని ఏపీఎస్పీడీసీఎల్ కార్యాలయం ముందు ధర్నాలు చేయాలని తెలిపారు. 17న చలో విద్యుత్ సౌధను జయప్రదం చేయాలని కోరింది. స్ట్రగుల్ కమిటీ నాయకులు పి.సుదర్శన్‌రెడ్డి, వి.సుబ్బారెడ్డి, వి.శివయ్య, ఎం.బాలకాశి, కట్టా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన ఏపీ మహిళ

మధిరలో రక్షించిన రెస్క్యూ టీం

మధిర: కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళను ఖమ్మం జిల్లా మధిరకు చెందిన రెస్క్యూ టీం కాపాడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడు మండలం తోటరాములపాడుకు చెందిన జైనాబీ కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోవాలని మధిర సమీపంలోని వైరా నదిపై ఉన్న రాయపటం బ్రిడ్జి వద్దకు చేరుకుంది. బ్రిడ్జి పైనుంచి నదిలోకి దూకే యత్నం చేస్తుండగా సమీపాన ఉన్న ఆర్కే ఫౌండేషన్, రెస్క్యూ టీం నిర్వాహకులు దోర్నాల రామకృష్ణ, జ్యోతితో పాటు జర్నలిస్ట్ రాజేష్ గమనించి అడ్డుకున్నారు. తనకు మాటలు పూర్తిస్థాయిలో రావని, ముగ్గురు పిల్లలు ఉండగా, భర్త మస్తాన్ పెట్టే చిత్రహింసలు భరించలేక ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో విషయాన్ని ట్రెయినీ ఐపీఎస్ అవినాష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన జైనాబీ కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.


జైనాబీ(మధ్యలో)తో రామకృష్ణ, జ్యోతి దంపతులు

హ్యాండ్‌బాల్ రాష్ట్ర సంఘానికి గుర్తింపు

విజయవాడస్పోర్ట్స్: పెనుమత్స సత్యనారాయణరాజు కార్యదర్శిగా కొనసాగుతున్న ఆంధ్రప్రదేశ్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌ను గుర్తిస్తూ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(హెచ్‌ఏఐ) బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్నేళ్లుగా రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్‌కు పోటీ సంఘాలు పుట్టుకొచ్చి క్రీడాకారులను అయోమయానికి గురి చేశాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ రాష్ట్రంలో ఒకే సంఘానికి హెచ్‌ఏఐ గుర్తింపు ఇచ్చింది. హెచ్‌ఏఐ గుర్తింపు ఆదేశాలతో రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఇదే సంఘాన్ని గుర్తించింది. ఈ సంఘానికి అధ్యక్షుడిగా ఎస్.కృష్ణకుమార్, కోశాధికారిగా పి.శివారెడ్డి ఉన్నారు.


సత్యనారాయణరాజు

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశ్లేషించి, వివిధ ప్రతిస్పందనలు పంపించాలి. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం

వించిపేట(విజయవాడపశ్చిమ): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం అయిన ఘటన బుధవారం చిట్టినగర్ టైలర్‌పేటలోని పెనుమాక దేవదాసు వీధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పెనుమాక దేవదాసు వీధిలోని ఓ ఇంట్లో కింది పోర్షన్‌లోని కరెంటు మీటర్ల నుంచి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. దీంతో ఆ పోర్షన్‌లో ఉంటున్న కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీశారు. దీనిపై బాధితులు విద్యుత్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయగా వారు సకాలంలో స్పందించి వచ్చి మంటలను అదుపు చేశారు. అదే వీధిలోని మరో ఇంట్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో నివాసముంటున్న వారు ఇంటికి తాళాలు వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో ఒక్కసారిగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఇంట్లోని గృహోపకరణాలు దగ్ధం అయ్యాయి. ఇరుగుపొరుగు వారు సకాలంలో స్పందించి నీళ్లు పోసి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ రెండు ఘటనలపై చిట్టినగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈకి ఫోన్ చేయగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.

వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీకి ఐఎస్ఓ గుర్తింపు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో రాష్ట్రంలో ప్రప్రథమంగా ఐఎస్ఓ 21001 : 2018 గుర్తింపు లభించింది. ఈ మేరకు బుధవారం కాలేజీలో జరిగిన విలేకరుల సమావేశంలో డీన్ డాక్టర్ చావా శ్రీనివాస్, ఐఎస్ఓ కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహారావు వివరాలు వెల్లడించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) నిబంధనల ప్రకారం విద్యా సంస్థలు నాణ్యతా ప్రమాణాలతో ఐఎస్ఓ 21001: 2018 ధ్రువీకరణ పత్రాలు పొందాలని ఆదేశించారన్నారు. దీంతో టీయువీ సౌత్ ఏషియన్ ప్రైవేట్ లిమిటెడ్ తమ కాలేజీలో సందర్శించి కాలేజీలో బోధన, పరిశోధన శాలలు, లైబ్రరీ, ఇతర సౌకర్యాలపై ఆడిట్ చేశారన్నారు. అన్ని ప్రమాణాలు సక్రమంగా ఉండటంతో కాలేజీకి ఐఎస్ఓ 21001: 2018 ధ్రువీకరణ పత్రం జారీ చేశారన్నారు. రాష్ట్రంలో యూజీసీ పరిధిలో ఐఎస్ఓ సాధించిన మొదటి కాలేజీ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ అని తెలిపారు. ఈ ధ్రువీకరణ పత్రం మూడు సంవత్సరాల వరకు వర్తిస్తుందన్నారు.



ఐఎస్ఓ ధ్రువీకరణ పత్రాన్ని చూపుతున్న డీన్ శ్రీనివాసరావు, ఐఎస్ఓ కోఆర్డినేటర్ నరసింహారావు

గంజాయి విక్రేతల అరెస్ట్

1.2 కేజీల గంజాయి, ఆటో స్వాధీనం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న గంజాయి వ్యాపారానికి పాల్పడుతున్న నేరస్తులను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.10 వేల విలువైన 1.200 కేజీల గంజాయి, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నందిగామ ఏసీపీ కె.జనార్ధననాయుడు జగ్గయ్యపేట సీఐ ఎం.జానకీరామ్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. జగ్గయ్యపేట ఎస్ఐ రామారావుకు వచ్చిన సమాచారం మేరకు బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో చిల్లకల్లు రోడ్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఆటోలో జగ్గయ్యపేట నుంచి వైఎస్సార్ సర్కిల్ వైపు వస్తూ పోలీసు వారిని చూసి పారిపోవడానికి యత్నించారు. వారిని పట్టుకుని విచారించగా, వారి ఆటోలో 1.200 కేజీల గంజాయిని గుర్తించారు. పట్టణంలోని ధనంబోడు కాలనీకి చెందిన షేక్ షాబుద్దీన్, విజయవాడలోని వైఎస్సార్ కాలనీకి చెందిన పోలంపల్లి రవికుమార్, విజయవాడలోని మాచవరం, కార్మికనగర్‌కు చెందిన గరికపాటి బాబులను అరెస్ట్ చేసి వారి వద్ద ఉన్న గంజాయిని, ఆటోను సీజ్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించి వారిపై కేసు చేసినట్లు తెలిపారు.


గంజాయి విక్రేతలతో ఏసీపీ జనార్ధననాయుడు, సీఐ జానకీరామ్, ఎస్ఐ రామారావు, సిబ్బంది

సేవాభారతి, తెలుగుతేజం పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని ప్రతిభ ఉండి పలు రంగాల్లో గుర్తింపు రాని వారిని గుర్తించి హైదరాబాద్‌లో ఆగస్టు 13న ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సేవాసంస్థ ఆధ్వర్యాన సేవాభారతి, తెలుగుతేజం పురస్కారాలతో సత్కరించనున్నట్లు అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఐఎస్ఎస్ నారాయణ మాస్టారు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు వచ్చేనెల 5వ తేదీలోపు వారు అందించిన సేవలను తెలియజేసే సర్టిఫికెట్లతో ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీకి దరఖాస్తులు పంపించాల్సిందిగా కోరారు. మరింత సమాచారం కోసం 96523 47207 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా ఆయన తెలిపారు.

పాములలంక వంతెనపై నివేదిక కోరిన లోకాయుక్త

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు–పాములలంక మధ్య కృష్ణానది పాయపై 2014లో నిధులు మంజూరైనా వంతెన నిర్మాణం ఇంతవరకు ప్రారంభం కాకపోవటంపై రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.రాజశేఖర్, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లను నివేదిక కోరుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ విషయమై ఈ నెల 7వ తేదీన రాష్ట్ర లోకాయుక్తకు తాను ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. కృష్ణానదిపై వంతెన నిర్మాణం కోసం 2014లో 13.50 కోట్లు మంజూరై, శంకుస్థాపన కూడా జరిగిందని, 2022లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో 31.50 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినా, ఇంతవరకు పనులు మాత్రం ప్రారంభం కాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నట్లు వివరించారు. తోట్లవల్లూరు–పాములలంక మధ్య కృష్ణానదిపై వంతెన నిర్మిస్తే లంక గ్రామాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని లోకాయుక్తకు విజ్ఞప్తి చేసినట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలియజేశారు.

రూ.10,421 కోట్ల విలువైన మిర్చి ఎగుమతి

గుంటూరు మెడికల్: భారతదేశం నుంచి వివిధ దేశాలకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎగుమతి చేసిన మిర్చి విలువ రూ.10,421 కోట్లు ఉంటుందని చిల్లీస్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి తోటా రామకృష్ణ బుధవారం తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రూ.1,861 కోట్లు ఎక్కువని పేర్కొన్నారు. మొట్టమొదటిసారిగా అధిక మొత్తంలో విదేశాలకు మిర్చి ఎగుమతి చేయడంపై అసోసియేషన్ తరఫున హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని మంత్రి నరేంద్రమోదీకి, మిర్చి రైతులకు, ఎక్స్‌పోర్టర్లకు ధన్యవాదాలు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

పటమట(విజయవాడతూర్పు): ఆఫీస్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా కాపు కాసి మహిళ మెడలో గొలుసు అపహరించిన ఘటన విజయవాడ నగరంలోని పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పటమట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇర్గంరెడ్డి పార్వతి ఏపీఐఐసీ కాలనీలోని హౌసింగ్ కార్పొరేషన్‌లో ఉద్యోగిని. ఆమె యథావిధిగా బుధవారం విధులు ముగించుకుని రాత్రి 7.30 గంటల సమయంలో వివేకానంద కాలనీలోని తంగెళ్లమూడి వీధిలో గల తమ ఇంటికి తిరిగి వస్తుండగా కాలనీలోని యలమంచిలి కుటుంబరావు పార్క్ వద్ద స్కూటీపై కాపు కాసిన ఆగంతకుడు ఆమె మెడలోని 32 గ్రాముల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పటమట సీఐ కాశీవిశ్వనాథ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

ఇబ్రహీంపట్నం: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని యోగా గురువు జనార్దన్ అన్నారు. వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో శాంతివన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏకాలసీలో ఉచిత శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

చాట్రాయి: రాజకీయాలకతీతంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. మండలంలోని బూరుగుగూడెం, కొత్తగూడెం గ్రామాల్లో సచివాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సేవలను ప్రజలు త్వరితగతిన వినియోగించుకునేందుకు ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలు నిర్మించామని తెలిపారు. గ్రామ వలంటీర్లు అందిస్తున్న సేవలను ప్రజలు హర్షిస్తుంటే ప్రతి పక్షాలకు మింగుడు పడక వారిని కించపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు హైమావతి, వెంకటేశ్వరావు, ఎంపీపీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో ఏడీఏ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, దీనిలో భాగంగానే రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఏడీఏ, ఏఓ కార్యాలయ భవనాలను బుధవారం ఎమ్మెల్యే ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను గ్రామాగ్రామాన ఏర్పాటు చేసి వాటి ద్వారా రైతుల కు ప్రభుత్వ సేవలన్నీ చేరువ చేసిందన్నారు. నూజివీడు, ఆగిరిపల్లి ఎంపీపీలు శిరీష, అనూష, జెడ్పీ వైస్ చైర్మన్ కృష్ణంరాజు, ఏడీఏ విద్యాసాగర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు

ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: వర్షాల కారణంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు కారణంగా గ్రామాల్లో ప్రజలు ఎటువంటి అసౌకర్యాలకు గురికాకుండా తగు సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా డ్రెయినేజీల్లో పూడికతీత పనులు వెంటనే చేయించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కేఏఎస్ రవికాంత్, తహసిల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీపీ నాగలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

మెరుగైన వైద్యం అందించాలి

ఏ.కొండూరు: కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే రక్షణనిధి పేర్కొన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. అక్కడ డయాలసిస్ రోగులకు చేస్తున్న వైద్యం గురించి అడి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ డయాలసిస్ కేంద్రంలో డయాలసిస్ చేయించుకునే విధంగా అన్ని వసతులు కల్పించామన్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత వైద్యాధికారులకు ఆదేశించారు. జెడ్పీటీసీ భూక్య గనియా, ఎంపీపీ నాగలక్ష్మి, తహసిల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోనేరు రంగారావుకు ఘన నివాళి

తిరువూరు: దివంగత ఉపముఖ్యమంత్రి కోనేరు రంగారావు జయంతి కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తిరువూరు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కోనేరు ఈ ప్రాంత సమస్యల పరిష్కారానికి కృషిచేశారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద కోనేరు రంగారావు చిత్రపటానికి ఆయన కుటుంబసభ్యులు నివాళులర్పించారు. రాష్ట్ర లిడ్ క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ పరిపూర్ణ ట్రస్టులో అనాథ బాలలకు అన్నదానం చేశారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

పుట్రేల(విస్సన్నపేట): సత్యసాయి సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని పుట్రేల గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి మాట్లాడుతూ నూజివీడు గిఫర్డు మెమోరియల్ కంటి వైద్యులు కంటిపరీక్షలు చేసి 30 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు.

సమస్యలను పరిష్కరించేందుకే 'జగనన్న సురక్ష'

నూజివీడు: ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని 15వ సచివాలయం పరిధిలోని 29,30 వార్డులకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పట్టణంలోని షాదీఖానాలో బుధవారం నిర్వహించారు. మున్సిపల్ డీఈ లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

ముగిసిన జగనన్న సురక్ష శిబిరాలు

చాట్రాయి: రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నెల 4 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరాలు బుధవారం ముగిశాయి. 16 సచివాలయాల్లో 11 రకాల సేవలకు సంబంధించి 8,059 ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ చేసారు.

మర్రిబంధంలో జగనన్న సురక్ష

నూజివీడు: మండలంలోని మర్రిబంధంలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, సర్పంచ్ వడ్డాది లక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు త్రినాథ్‌రావు పాల్గొన్నారు.

వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మైలవరం(ఇబ్రహీంపట్నం): విస్తారంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ రమేష్ అన్నారు. మైలవరం మండలంలో పొంగుతున్న కాకర్ల వాగును సీఐ మోహన్‌రెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు.

హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

నూజివీడు: మండలంలోని మీర్జాపురం హైస్కూల్లో బుధవారం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు (ఎస్‌జీటీ) స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. కాంప్లెక్స్ చైర్మన్ పుష్పలత,సెక్రటరీ రాజేంద్రబాబు, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గొల్లపల్లి హైస్కూల్లో...

గొల్లపల్లి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో భౌతికశాస్త్రం బోధించే ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. నూజివీడులోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్లో తెలుగు, జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో గణితం, ఆగిరిపల్లి హైస్కూల్లో హిందీ, ఈదులగూడెం హైస్కూల్లో ఇంగ్లీష్, ఈదర హైస్కూల్ సోషల్ సబ్జెక్టులకు సంబంధించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను నిర్వహించారు.

30న ఉచిత వైద్యశిబిరం

తిరువూరు: ఈ నెల 30న ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తిరువూరు అమరావతి ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. చిన్న పిల్లల వైద్యనిపుణులు వాసవి, సందీప్, శ్రీనివాస కిషోర్‌లు ఈ వైద్యశిబిరంలో నవజాతశిశువులు, చిన్నపిల్లలకు ఉచితంగా వైద్యసేవలందిస్తారని పేర్కొన్నారు.

సమస్య ఉంటే విద్యుత్ అధికారులను సంప్రదించండి

రెడ్డిగూడెం: విద్యుత్ మోటార్లు, స్టార్టర్స్, డబ్బాలు తడిసి ఇబ్బంది పడుతుంటే విద్యుత్ అధికారులను సంప్రదించాలని ఏఈ కిరణ్ పేర్కొన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య ఉంటే వెంటనే మీ లోకల్, లైన్ ఇన్‌స్పెక్టర్స్ లేదా లైన్‌మన్‌కు లేదా 94408 17568కు తెలిజేయాలని ఏఈ పేర్కొన్నారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని హజ్రత్ బోడ్‌షావలి బాబా ఉరుసు మహోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది మొహరం నెల ప్రారంభంలో ఉరుసు ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ముఖ్య అతిథిగా అనంతపురం నుంచి ముతవల్లీల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు షకీల్ షఫీ పాల్గొన్నారు. తొలుత సూఫీ మత గురువు ఆల్తాఫ్‌రజా ఆయనకు ఘన స్వాగతం పలికారు. బాబా వారికి చాదర్ సమర్పించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా ముజావర్లు, న్యాయవాది ముక్తార్ ఆలీ, ఫారూక్, రమావత్ తదితరులు పాల్గొన్నారు.